మురళీధర్‌రావుకు సన్మానం



మేడ్చల్: మేడ్చల్ పట్టణానికి చెందిన బీజేపీ నేతలు పార్టీ సీనియర్ నేత మురళీధర్‌రావును కలిశారు. ఆయన ఇన్‌చార్జిగా వ్యవహరించిన మధ్యప్రదేశ్ రాష్ట్రంలో బీజేపీ అఖండ విజయం సాధించింది. ఈ సందర్భంగా పట్టణ నాయకులు ఆయనను శాలువాతో సన్మానించారు. నాయకులు వంశీవిజయ్, నాగసాయి సంతోష్, ప్రశాంత్, భరత్, చేతన్, ప్రణయ్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ కార్మికుల సంబురాలు



మేడ్చల్: రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నూతన ప్రభుత్వం ఏర్పడటంతో మేడ్చల్‌లో ఆర్టీసీ కార్మికులు సంబురాలు జరుపుకున్నారు. బస్టాండ్ ఆవరణలో టపాసులు పేల్చి మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. నూతన ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకుంటుందనే ఆశాభావం వ్యక్త చేశారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎస్‌కేఎం స్కూల్ విద్యార్థులు



మేడ్చల్‌రూరల్: మండలంలోని మునీరాబాద్ గ్రామంలోని ఎస్‌కేఎం స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాలో నిర్వహించిన సెలక్షన్స్‌లో స్కూల్‌కు చెందిన అరుణ్, శ్రీవాణి అండర్ -14 విభాగంలో.. అక్షయ, మహాలక్ష్మి అండర్-17 విభాగంలో ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయలు అభినందించారు.

ఎంపీపీ దంపతులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



కీసర: కీసర మండల ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ పెళ్లిరోజును పురస్కరించుకొని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ దంపతులు తమ కులదైవమైన శ్రీచీర్యాల లక్ష్మీనృసింహస్వామి సేవలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ వేద పండితులు ఎంపీపీ దంపతులకు స్వామివారి ఆశీర్వచనంతో పాటు మహాప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్ స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు.

ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌కు రామలింగేశ్వరుడి ఆశీర్వచనం



కీసర: ఉప్పల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన బండారి లక్ష్మారెడ్డికి గురువారం కీసరగుట్ట ఆలయ వేదపండితులు స్వామివారి ఆశీర్వచనంతో పాటు మహాప్రసాదాన్ని అందజేశారు. ఈ మేరకు గురువారం నగరంలోని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నివాసానికి వేదపండితులతో కలిసి వెళ్లిన కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం రమేష్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వరుడి ఆశీర్వచనంతో పాటు మహాప్రసాదాన్ని అందజేశారు.

ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తాం

మల్కాజిగిరి: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు సుస్థిర పాలన, సంక్షేమ పథకాలు అందుతాయని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో పాటు మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అన్ని వర్గాలకు న్యాయం చేకూరుతుందన్నారు. దశాబ్దాల బీఆర్‌ఎస్ నిరంకుశ ప్రభుత్వ పాలనకు ప్రజలకు చరమగీతం పాడారాని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి పాలన కొనసాగుతుందన్నారు.

వైన్‌షాప్ వద్దంటూ ధర్నా

రామంతాపూర్: కేటీఆర్ నగర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న వైన్‌షాప్‌ను రద్దు చేయాలంటూ కేటీఆర్‌నగర్, శ్రీరామణపురం, టీవీ కాలనీ, చర్చి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు సీపీఎం నేతలతో కలిసి గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వైన్‌షాప్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలోని పలుబస్తీలు, కాలనీల్లో వేల కుటుంబాలు నివసిస్తున్నాయని, మహిళలు జీవనోపాధికి ఈ రోడ్డు మీదుగా స్థానిక పారిశ్రామికవాడలోని చిన్న చిన్న ఫ్యాక్టరీలకు వెళ్తారని, నిత్యం వేల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తునంటారని, వారికి ఇబ్బందులు తప్పవని వారు అన్నారు. మహిళలకు భద్రత కరువవుతుందని వెంటనే వైన్‌షాప్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని కోరారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు శ్రీనివాసులు, శివన్న, వెంకటేశ్వర్లు, భీష్మాచారి, సత్తిరెడ్డి, సుధాకర్, రాఘవేంద్ర, పద్మ, సాయిలు, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

- వర్షం కురిస్తే గదుల్లోకి నీళ్లు చేరి తడుస్తున్న ఫైళ్లు
- మరమ్మతులు చేస్తూ.. కార్యాలయాన్ని కొనసాగిస్తూ..
- రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చేవారికి ఇబ్బందులు
- పార్కింగ్ వసతి లేకపోవడంతో తప్పని తిప్పలు

శిథిల భవనంలో తహసీల్దార్ కార్యాలయం



అద్దె భవనంలో రిజిస్ట్రార్ కార్యాలయం



శిథిలం.. అయినా నిర్లక్ష్యం..

నిజాం కాలంనాటి భవనంలో తహసీల్దార్ కార్యాలయం

మేడ్చల్: కొన్ని శాఖలకు పెద్ద పెద్ద భవనాలు అవసరం లేకున్నా అదనపు భవనాలు నిర్మిస్తున్నారు. సువిశాల కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే నిత్యం ప్రజలతో కిక్కిరిసిపోయే కార్యాలయాలకు మాత్రం దిక్కులేకుండా పోయింది. ఒకటి శిథిల భవనంలో కొనసాగితే.. మరొకటి అద్దె భవనంలో కొనసాగుతోంది. దీంతో నిత్యం ఆ కార్యాలయాలకు వెళ్లే ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

◆ మండల రెవెన్యూ కార్యాలయం నిజాం కాలంనాటి శిథిల భవనంలోనే కొనసాగుతూ మేడ్చల్ అభివృద్ధిని వెక్కిరిస్తోంది. మేడ్చల్ పట్టణ నడిబొడ్డున మండల తహసీల్దార్ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయ భవనం నిజాం కాలంలో అశ్వశాల కోసం నిర్మించిన భవనం. కాలక్రమేనా అందులో మొదటి నుంచి మండల రెవెన్యూ కార్యాలయం కొనసాగుతూ వచ్చింది. ఈ భవనంలో ఉన్న సమితి కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్, టెలికాం కార్యాలయాలు భవనం పాతది కావడంతో నూతన భవనాల్లోకి ఎన్నో ఏళ్లక్రితమే మారాయి. నేడు అందమైన విశాల భవనాల్లో కొనసాగుతున్నాయి. రెవెన్యూ కార్యాలయం మాత్రం శిథిలావస్థకు చేరిన భవనంలోనే కొనసాగుతోంది.

◆ కార్యాలయంలో ఉన్న గదులు శిథిలం కావడంతో కార్యాలయం ఇరుగ్గా మారింది. ప్రజలు, అధికారులకు అందరికీ సరిపడా గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రికార్డు గది పూర్తిగా శిథిలం కావడంతో రికార్డులకు భద్రత లేకుండా పోయింది. వర్షం కురిస్తే గది కురుస్తుండటంతో నీళ్లు రికార్డుల్లోకి వెళ్తుండటంతో రికార్డులకు భద్రత కరువవుతోంది. అధికారులు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసి భవనానికి మరమ్మతులు చేసి కొనసాగిస్తున్నారు.

జాడలేని పక్కా భవనం..

ఉమ్మడి రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయ పక్కా భవనం కోసం 2014లో శంకుస్థాపన చేసినా.. అది ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. కనీసం శిలాఫలకం జాడ కూడా కనిపించలేదు. కనీసం స్థలం ఎక్కడ కేటాయించారో తెలియని పరిస్థితి నెలకొంది. పాత భవనంలో సువిశాల స్థలం ఉండటంతో ఆ ప్రాంతంలోనే నూతన భవనం నిర్మించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంతో అన్నీ ఇబ్బందులే..

మేడ్చల్ పట్టణంలో జాతీయ రహదారి పక్కన బహుళ అంతస్తు భవనంలోని రెండో అంతస్తులో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, మేడ్చల్ సంయుక్త సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. మొదటి అంతస్తులో డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాలు, మరో అంతస్తులో మేడ్చల్ మండల కార్యాలయం, జిల్లా కార్యాలయం ఏర్పాటు చేశారు. భవనానికి లిఫ్ట్ లేకపోవడం, మెట్లు పైనుంచి వెళ్లడానికి ఇనుప మెట్లు ఏర్పాటు చేశారు. వృద్ధులు, ఇతరులు, వికలాంగులు, పైకి వెళ్లేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది. వాణిజ్య భవనం కావడంతో పార్కింగ్ పెద్ద సమస్యగా మారింది. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చే వారు అధికంగా కార్లు, ద్విచక్రవాహనాలపైనే వస్తుండటంతో వాహనాలను పార్కు చేసేందుకు సరిపడా స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే పెట్టాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్ జాం, అనవసరంగా చలాన్లు పడటంతో కార్యాలయాలకు వచ్చే వారికి, వాణిజ్యం కోసం వచ్చేవారికి అన్నీ ఇబ్బందులే ఏర్పడుతున్నాయి. ఈ విషయంపై ఎమ్మెల్యే మల్లారెడ్డి దృష్టి సారించి ప్రజలు, అధికారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



కార్మికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ముల్లి పావని

పోచారం: పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులను సిబ్బంది సక్రమంగా నిర్వర్తించడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని డ్వాక్రా భవనంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెత్త సేకరణ, రహదారుల పరిశుభ్రత విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రజలు ఎన్నికల ప్రచార సమయంలో తన దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. రోడ్లపై చెత్త లేకుండా చూడాలని, స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వర్క్ఇన్‌స్పెక్టర్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలు పక్కా





కీసరలో కాంగ్రెస్ నేతల సంబరాలు

కీసర: రాష్ట్ర సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం సందర్భంగా మండల కేంద్రమైన కీసరలో కాంగ్రెస్ నేతలు సంబురాలు నిర్వహించారు. కీసరలోని బంగారు మైసమ్మ ఆలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కీసర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలన ప్రారంభమైందని, సీఎం రేవంత్‌రెడ్డి పేదలకు ఇచ్చిన 6 గ్యారంటీ హామీలను తప్పకుండా అమలు చేయనున్నట్లు తెలిపారు. మండల వైస్‌ఎంపీపీ జలాల్‌పురం సత్తిరెడ్డి, జూపల్లి రవీందర్, తటాకం అభిలాష్, శ్రీనివాస్‌గౌడ్, ముద్దం మల్లేష్, ప్రదీప్, రామిడి స్వప్న, చర్లపల్లి కృష్ణారెడ్డి, ముద్దం వెంకట్, రామిడి సత్తిరెడ్డి, మల్లేష్, దయానంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడికి పాల్పడ్డ వారిపై కేసు నమోదు



విలేకరిపై దాడి కేసులో నిందితులు

శామీర్‌పేట్: విలేకరిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై శామీర్‌పేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఇటీవల శామీర్‌పేటలో కురుమ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఎన్నికల కోడ్‌ను ఉల్లగించి కార్యక్రమం నిర్వహిస్తున్నారనే సమాచారంతో శామీర్‌పేట మండలంలో పనిచేసే కొందరు విలేకరులు అక్కడికి వెళ్లారు. కురుమ ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి, ప్రస్తుత మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఓటు వేయాలంటూ జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య ఉపన్యాసం ఇవ్వడంతో గొడవ ప్రారంభమైంది. ఆత్మీయ సమ్మేళనంతో ఎన్నికల ప్రస్తావన ఏంటని సమావేశానికి హాజరైన వారిలో కొందరు వాగ్వాదానికి దిగారు. ఈ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న విలేకరిపై కొందరు వ్యక్తులు విలేకరి సెల్‌ఫోన్ లాక్కొని, దుర్భాశలాడారు. దీంతో సదరు విలేకరులు శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు దాడిచేసిన జవహర్‌నగర్ మేయర్ కావ్య తమ్ముడు మేకల భార్గవ్, అనుచరుడు కాశిపై 323, 506 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు.

లయోలా కళాశాలలో ముగిసిన యువజనోత్సవం



యువజనోత్సవ సాంస్కృతిక సంబురాల ముగింపు వేడుకలు

అల్వాల్: అల్వాల్ లయోలా కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన యువజననోత్సవ సంబరాలు గురువారం ముగిశాయి. విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయడానికి అకాడమీ ప్రతి ఏటా నిర్వహించే సాంస్కృతిక వేడుకలు ఈ నెల 6, 7వ తేదీల్లో నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. ఇంటర్, ఇంట్రా కాలేజ్ పోటీలు నిర్వహించారు. మొదటి రోజు కార్యక్రమానికి లవ్‌మౌళి చిత్ర బృందం జోరుగా హుషారుగా చిత్ర బృందాలు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులతో కలిసి సందడి చేశారు. సినీ చిత్ర పాటల రచయిత, సింగర్ అనంత శ్రీరామ్ తన మధురమైన స్వరంతో విద్యార్థులను అలరించారు. లవ్‌మౌళి చిత్ర కథానాయకుడు నవదీప్, రేడియో మిర్చి కిరణ్, రేడియో ఆర్‌జే, కామెడియన్ హేమంత్ పాల్గొన్నారు. జోరుగా హుషారుగా చిత్రం హీరో విరాజ్ అశ్విన్, చిత్ర డైరెక్టర్స్ మాట్లాడుతూ విద్యార్థి జీవితం ఎంతో మధురమైందన్నారు. కళాశాల రెక్టర్ రెవ. ఫాదర్, సీహెచ్ అమరరావు మాట్లాడుతూ ప్రస్తుతం మనం డిజిటల్ ప్రపంచంలో జీవిస్తున్నామన్నారు. నిత్యం సమాజంలో మారుతున్న పరిణామాలపై జ్ఞానాన్ని పెంచుకుంటూనే తమలో దాగిఉన్న కళలను బయటకు తీయాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ రెవ. ఫాదర్ జోజిరెడ్డి ఎస్.జే, టీవీ ఇండస్ట్రీ నుంచి ప్రముఖులు వైష్ణవ్‌దేవ్, శ్రీనాథ్, వి. శ్రీనివాస్, నరేష్ అగస్త్య, అభినవ్, రోషన్ కనకాల, మానస అతిథులుగా హాజరయ్యారు. కళాశాఈల రెక్టర్, రెవ.ఫాదర్ సీహెచ్ అమరరావు ఎస్‌జే, కరస్పాండెంట్ రెవ, ఫాదర్ డాక్టర్ ఫ్రాన్సిస్ జేవియర్ ఎస్‌జే, కళాశాల ప్రిన్సిపాల్ రెవ. ఫాదర్, డాక్టర్ జోజిరెడ్డిఎస్‌జే, కళాశాల విద్యార్థి విభాగం కో ఆర్డినేటర్ శరస్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఆర్‌ఎంఎస్ మాక్ ఆన్‌లైన్ టెస్ట్

జవహర్‌నగర్: ఆల్ ఇండియా లెవెల్ రాష్ట్రీయ మిలటరీ స్కూల్స్ మాక్ టెస్ట్‌ను ఈ నెల 10వ తేదీన ఉచితంగా నిర్వహిస్తున్నామని దమ్మాయిగూడ క్రాంతి కీన్ స్కూల్ ప్రిన్సిపల్ కళ్యాణి ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతికి జరిగే ఈ ప్రవేశ పరీక్షకు 300 సీట్లకు దేశవ్యాప్తంగా పోటీ ఉంటుందని, క్రాంతి కీన్ అకాడమీ ఫర్ ఆర్‌ఎంఎస్ ఆధ్వర్యంలో మాక్ టెస్ట్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షలో పాల్గొనాలనుకునే వారు ఫోన్: 81212 12642కి వాట్సాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

భార్యాభర్తల గొడవ.. భర్త ఆత్మహత్య

జవహర్‌నగర్: భార్యాభర్తల గొడవతో భర్త ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ రాజిరెడ్డినగర్ కాలనీలో నివసించే పోచంపల్లి పవన్‌కళ్యాణ్(27), భార్య నిరీషాలు ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. సంవత్సర క్రితం ప్రేమ వివాహం చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. కొంత కాలంగా భార్యభర్తల మధ్య తరచూ గొడవలు చోటుచేసుకునేవి. ఈ నెల 6వ తేదీన ఇద్దరి మధ్య మాటమాట పెరిగి గొడవ జరిగింది. పవన్‌కళ్యాణ్ మరో గదిలోకి వెళ్లి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు, బంధువులు ఇంటి తలుపును పగలగొట్టి చూడగా అతడు అప్పటికే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్: ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మేడ్చల్ కేఎల్‌ఆర్ వెంచర్‌లో నివాసం ఉండే విష్ణుప్రసాద్(24), ఫార్మాసిస్ట్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

రైలు ప్రమాదంలో బీఆర్‌ఎస్ నేత శ్రీనివాస్ మృతి

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ జేఎల్‌ఎస్‌ఎస్‌నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నేత శ్రీనివాస్ బుధవారం రైలు ప్రమాదంలో మృతి చెందారు. జడ్చర్లలోని తన సమీప బంధువు మృతి చెందడంతో శ్రీనివాస్ బుధవారం రైలులో వెళ్లాడు. మధ్యాహ్నం రైలు ప్రమాదంలో మృతి చెందాడు. అక్కడ పోస్టుమార్టం అనంతరం గురువారం నగరంలోని జేఎల్‌ఎస్‌ఎస్‌నగర్‌లో తన నివాసానికి శ్రీనివాస్ మృతదేహాన్ని తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ దంపతులు శ్రీనివాస్ అంత్యక్రియలకు రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

ఉప్పల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం తెల్లవారు జామున వృద్ధుడు(75) ఉప్పల్ మెట్రో స్టేషన్ నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలైన వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వివరాలు, ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు

అల్వాల్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా అల్వాల్‌కు చెందిన స్వర్ణకారుడు ప్రదీప్‌కుమార్ రాగి ఆకుపై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రాన్ని రూపొందించి తన అభిమానాన్ని చాటుకున్నాడు.

వెల్కమ్ ది నౌ ఆల్బమ్‌లో నగర యువత

సాక్షి, సిటీబ్యూరో: స్నేహ పిపాస, స్వేచ్ఛా ప్రియత్వాన్ని పెంపొందిస్తూ బిగ్ బ్యాంగ్ మ్యూజిక్, కలెక్టివ్ క్రియేటివ్ ల్యాబ్స్ సహకారంతో మాన్షన్ హౌస్ ఫ్లాండీ ఆధ్వర్యంలో వెల్కమ్ ది నౌ ఆల్బమ్ రూపొందింది. దీన్ని విడుదల చేసిన సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ ఆల్బమ్‌లో నగరానికి చెందిన అసుర, నవాబ్ గ్యాంగ్ వంటి రాక్ బ్యాండ్స్‌తో పాటు గల్లీబాయ్ రియాజ్, మోడల్, నటి తేజస్వి మదివాడ తదితరులు ఆడి పాడి అలరిస్తారని వివరించారు. యూ ట్యూబ్‌లో ఈ ఆల్బమ్‌ను వీక్షించవచ్చన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నేతలు

గౌతంనగర్: మల్కాజిగిరికి చెందిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును గౌతంనగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ బీ-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, నాయకులు పీవీ సత్యనారాయణ, సిరిగిరి రాజు, వెంకట్ గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

10న కాపు కులాల వనభోజన మహోత్సవం

కుషాయిగూడ: పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఈ నెల 10న కాప్రా కాపు కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 24వ కార్తీక వనభోజన మహోత్సవాన్ని నిర్వహించ తలపెట్టినట్లు కాపు కులాల ఐక్యవేదిక కాప్రా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కీసర ఓఆర్ఆర్ సమీపంలోని మధురనగర్ హౌసింగ్ సొసైటీలో నిర్వహించే ఈ వేడుకకు కాపులు, తెలగ, బలిజ, ఒంటరి, మున్నూరు కాపు, తూర్పుకాపు సోదరులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి కాపు కులాలకు చెందిన రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, కుల పెద్దలు హాజరవుతారన్నారు.

నియామకం

కుషాయిగూడ: ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ అండ్ మైనారిటీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కుషాయిగూడకు చెందిన కర్రె సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం కుషాయిగూడలో జరిగిన రాష్ట్ర సమావేశంలో ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తనపై విశ్వాసంతో రాష్ట్ర అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ అండ్ మైనారిటీల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. నూతన ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరారు.

మల్లికార్జునస్వామి సేవలో శ్రీధర్

అల్వాల్: కొమురవెల్లి మల్లికార్జునస్వామిని, కొండపోచమ్మ అమ్మవారిని అల్వాల్‌కు చెందిన ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి నందికంటి శ్రీధర్ గురువారం దర్శించుకున్నారు.

నిమ్స్ కొత్త చైర్మన్‌గా సీఎం రేవంత్‌రెడ్డి

లక్డీకాపూల్: నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) నూతన చైర్మన్‌గా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వ్యవహరించనున్నారు. ఇక నుంచి నిమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా సీఎం రేవంత్ కొనసాగుతారు. బొక్కల దవాఖానా నుంచి నిజాం వైద్య విజ్ఞాన సంస్థగా ఎదిగిన మొదలు నిమ్స్ చైర్మన్‌గా రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవహరిస్తూ వస్తున్నారు. అదే క్రమంలో గురువారం రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి నిమ్స్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సీఎంతో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా నిమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. ఈయన నిమ్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యులుగా కొనసాగనున్నారు. ఇప్పటి వరకు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న తన్నీరు హరీష్‌రావులు గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ క్రమంలో నిమ్స్ పారా మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ శిరందాస్, నిమ్స్ నాన్ ఫ్యాకల్టీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యగౌడ్, సురేష్ బాబులు కొత్త సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సీఎం రేవంత్ హయాంలో ఆస్పత్రి విస్తరణ అభివృద్ధి జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

రాఫా చర్చిలో సెమీ క్రిస్మస్ సంబరాలు

మౌలాలి: రాఫా చర్చిలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు సంబరాన్నంటాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫెయిత్ హౌస్, లవ్ మినిస్ట్రీ పాస్టర్ ఇజ్రాయెల్ వాక్య సందేశం అందించారు. కార్యక్రమంలో పాస్టర్ శ్రీకాంత్, విజయరాణి, సెర్ల అనిల్, సతీష్, అనిత, రేవంత్, మల్లిక తదితరులు పాల్గొన్నారు.